దృష్టిదోషం

"రాజు"

వెంకటరత్నమ్మ మామిడిపూడి అగ్రహారీకు డైన వేదాంతం రామశాస్త్రిలుగారి ఏకైకపుత్రిక. రామశాస్త్రిలుగారు నాలుగు వేదాలూ తలక్రిందులుగా వల్లెవేసిన ఘనాపాఠీ. 'అష్టవర్షా భవేత్కన్యా' అనేశాస్త్రవాక్యాన్నతిక్రమించలేకా, మనుమరాలి వివాహమహోత్సవం కండ్లారా చూస్తేనేగాని ప్రాణం విడువనని భీష్మించుకున్న ముసలితల్లి ముచ్చట తీర్చడానికీ సుక్షేత్రమైన ఖండిక అయిదెకరాలు అమ్మి, మహా వైభవంగా సరిగా ఎనిమిదవఏట వెంకటరత్నమ్మపెళ్లి చేశాడు. ఇంతశాస్త్రోక్తంగా సాలంకృతకన్యాదానంచేసిన పుణ్యాత్ముడెవ్వడూ లేడనిచెప్పుకున్నారు చుట్టుపక్కలనున్న అగ్రహారీకులు. ఏడుతరాల పితృదేవతలు తరించిపోయారని సంతోషించాడు శాస్త్రులుగారు. వివాహమైన సంవత్సరం తిరుగకుండానే వెంకటరత్నమ్మపసుపుకుంకం భగ్నమైపోయింది. రెండోసారి శ్రావణ గౌరీవ్రతం చేసుకొనే యోగ్యత ఆమెకు లేకపోయింది. అగ్రహారంలో అశేషజనం శాస్త్రులుగారిని గురించి జాలిపడేవాళ్లే. "ఇంతకూ పాపం ఆయ నేం చేస్తాడు? దాని మొగాన్ని పసుపు కుంకం వ్రాత లేందే" అని చప్పరించేశారు. ఎద్దుపుండు కాకి కేమి నొప్పి?

*　*　*

కొన్నాళ్లపాటు శాస్త్రిలుగారి కుటుంబం ఈదుఃఖంతో కుమిలినా కాలక్రమేణ లోకంతోపాటే అయారు. వీరేశలింగంపంతులు పేరు చెపితే మండిపడే శాస్త్రిలుగారు పంతులు కాళ్లు పట్టుకుందామా అని ఆలోచించాడు మొదట్లో. తన ధర్మశాస్త్రపాండిత్యమంతా వితంతూద్వాహసమర్థనానికి వినియోగించాలని ఆలోచించాడు. కాని సాహసం చెయ్యలేకపోయాడు. సంఘశాసనాన్ని దాటలేక లోకంతోపాటే అయినాడు. వెంకటరత్నమ్మ చాలాచురుకైనపిల్ల. శాస్త్రిలుగారు శిష్యులతోపాటు ఆమెకు కూడా చక్కగా సంస్కృతం తెలుగూ పాఠాలు చెప్పేడు. అల్లుడు పోయిననాటినుంచీ అదోకవిరక్తిగా చదువుచెప్పడం మానేశాడు. కాని వెంకటరత్నమ్మ స్వయంగానే అనేక పుస్తకాలు చదువుకుంటూ కాలక్షేపం చేసేది. చాలా కాలం ఆమెకు వైధవ్యంఅంటే బొట్టు పెట్టుకోకపోవడం, తోడిపడుచులతో పేరంటాల కెళ్లకపోవడం తప్ప వేరే కష్టమేమీ నాట లేదు. ఆమె ఈడేరిననాడుమాత్రం కొంపలో గొల్లుమన్నారు. శవమెళ్లినంత గోలైంది. ఆనాడుమాత్రం ఆమెకు హృదయం చివుక్కుమంది. ఆనాటినుంచి తనఅవస్థనుగురించి ఆలోచించడం ప్రారంభించింది. ఆట్టే ఆలోచించగా సంఘంమీద రోతపుట్టింది. నిత్యం

వృద్ధిపొందుతూఉన్న తనసౌందర్యంమీద తనకే అసహ్యం పుట్టింది. ఏమైతే నేమి? నిత్యం 'ప్రాలుబ్ధతత్త్వం' చెవుల్లో ప్రతిధ్వనిస్తూ ఉండడంవల్లనై తేనేమిటి, నిస్సహాయతవల్లనై తేనేమిటి లోకంతోపాటే ఆమె కూడా సంఘంయొక్క నిరంకుశత్వానికి తలొగ్గింది. ప్రపంచంలో ఎక్కువ కష్టపడే వాళ్లకే సౌఖ్యం తక్కువ. హిందూసంఘంలో అస్పృశ్యులని అగౌరవంగా చూడబడేవాళ్ల కాయకష్టమే ఉత్తమజాతులసౌఖ్యానికి మూలమైఉంది. హిందూ కుటుంబంలోని వితంతువు గతీ అంతే కుటుంబానికెక్కువ కష్టించడం, అందరికన్నా తక్కువ హక్కులను, సౌఖ్యాన్ని అనుభవించడం. రత్తమ్మ ఈ అనర్హతలనన్నీ చూస్తూ, అనుభవిస్తూ కాలం గడుపుతోంది. సహజంగా తెలివైనదవడం చేత చుట్టుప్రక్కల అందరికీ తలలోని నాలుకలా మెలిగింది. ఒంటెత్తు కాపురాలవారి పిల్లలను సముదాయించడం, కొత్తకోడళ్లకు జడలల్లడం, కొత్తనగలను, బట్టలను పసందు చేయడం ఆమెకాలక్షేపాలు. కొత్తవిషయాల్ని సూక్ష్మంగాగ్రహించి తోడిపడుచుల సౌఖ్యానికి ఉపయోగించేది. మొత్తంమీద రత్తమ్మలాంటి మంచి మనిషి లేదనిపించుకుంది.

* * *

కాలం తల్లక్రిందైంది. పదిమందినోళ్లల్లోనూ పరువుగా బ్రతికే రత్తమ్మ లేనిపోని అప్రతిష్ఠకు పాలైంది. పొరుగింటి కామావధానుల కోడలు సుబ్బలక్ష్మమ్మ తొలిచూలు కొడుకునెత్తుకొచ్చింది. తనకు లేని విషయాన్ని గురించి ముచ్చటపడడం లోకంలో సహజమే కనుక పిల్లవాడిని చూడాలనే సంతోషంకొద్దీ వెంకటరత్నమ్మ వాళ్లింటి కెళ్లింది. పిల్లవాడిని చూడడానికి రత్తమ్మే ముందయింది. కామావధానులభార్య సోదెమ్మకు మాత్ర మెంతో కష్టంతోచింది. 'శుభమా అంటూ వాకట్లోకి పిల్లాణ్ని ఎత్తుకొస్తే ఊళ్లో పసుపూకుంకంగల ఆడకూతుళ్లెవ్వరూ లేనట్లు ఈ బాలవెధవే ముందొచ్చిందమ్మా, ఏమరిష్టమోను' అంటూ విసుక్కుంది ఆవిడ. మొగంమీద ఏమీఅనలేక ఊరుకుంది. గుప్పెడైతే మిరపకాయలు దిగతుడిచి నిప్పుల్లో పోసింది. వచ్చినప్పటినుంచి నలతగానేఉన్న పిల్లాడు మరిపదరోజులకు జ్వరం వచ్చి చనిపోయాడు. ఆపిల్లవాని చావుకు కారణం రత్తమ్మఅపశకునమేనని సోదెమ్మ నమ్మకం. ఆనమ్మకంతో ఊరుకుంటుందా? ఊరంతాసాటింది. 'అప్పుడే అనుకున్నానమ్మా, ఏదో కొంపమునుగుతుందని. దానిదిష్టి అంత పాపిష్టిదమ్మా' అంటూ అక్కడక్కడా అంటించేసింది. 'అవునమ్మా, కొందరికళ్లల్లాంటివే ఉంటాయమ్మా' అని ఊకంఇచ్చేరు కొందరు అమ్మలక్కలు. రత్తమ్మకనబడితే కామావధానులింట్లో ఇంటిల్లుపాతీ మొగంచిట్లించుకోవడం, మాటాడకపోవడం ఆరంభించారు. దీనికి కారణం ఆమెకు తెలియనే తెలియదు. కొన్నాళ్లకి పొరుగింటివారికోడల్లొకావిడ ఛా

మంతిపువ్వుల జడేసుకుని శాస్త్రులుగారింటి కొచ్చింది. రత్తమ్మకు పువ్వులమీదుండే ప్రేమకొద్దీ ఆవిడజడ పరీక్షించి పదిసారులు పసందుచేసింది. ఇదివరకే వ్యాపించిఉన్న పుకారులవల్ల ఆమెమనస్సు కేదో సందేహం తోచింది. సందేహించినట్లుగానే ఆమెకు ఝల్లుమంటూ జ్వరంవచ్చి పది లంకణాలు చేసింది. ఇంటిల్లిపాదీ రత్తమ్మను అడ్డమైన తిట్లూ తిట్టి దిగదుడుపులు తీశారు. దీనితో వెంకటరత్తమ్మ అపఖ్యాతి మరింత బలపడింది. ఆమె వాకట్లో కెడితే తలుపు వేసుకోవడం, పిల్లలనైనా దగ్గరకు చేరనివ్వకపోవడం జరుగుతూవచ్చింది.

* * *

"ఏమండోయి ఇదిగో! చెప్పితే మీకు కాదూ? మాటవినిపించుకోరేమీ?" అంటూ కరణంగారి కోడలు భర్త రామారావు పంతులుని వెనక్కిపిలిచింది. పంతులు సుష్టుగా భోంచేసి మధ్యపాపిడి క్రాపింగు షోకుగా దువ్వుకుని, పట్టీవిడాయించి శివాలయం మంటపంలో పేకాటకు తొందరగా వెళుతున్నాడు. పెండ్లాంకేకలకు విధిలేక విసుక్కుంటూ వెనక్కితిరిగేడు.

"మీకెన్నిసారులు చెప్పినా పరగడుపేనా ఏమిటి?ఆయింటి ముందరనుంచెడుతూ ఆపోకెందుకు? శాస్త్రులుగారి దిష్టిదేవమ్మ కళ్లడ్డయంటే ఏదోరోగమో, రొష్టో వస్తుందంటే అంత అలక్ష్యమేమిటి?" అంటూ ఎవరూ లేరుగదాఅనుకుని రుసరుసలాడింది కరణంగారి కోడలు. పంతులు "ఇందుకేనా వెనక్కిపిలుస్త. ఏడిశావులే" అని గిర్రున తిరిగి చక్కాపోయాడు. అప్పుడే అప్పడాలకర్ర కోసం వాళ్లింటికొచ్చిన శాస్త్రుల్లుగారిభార్య వెంకమ్మగారి చెవుల్లో బడ్డాయి ఈ మాటలు. ఇదివరకే చూచాయగా వింటూవచ్చిన విషయానికి ప్రత్యక్షంగా సాక్ష్యం దొరికింది. వెంకమ్మగారికి గంగవెర్రులెత్తేయి. కరణం కోడలిని ఛడామడా ఝాడించేసింది. 'మాటకి మాట తెగులు, నీటికి నాచు తెగులూ' అన్నట్లు మాటమీదమాటొచ్చి నలుగురూ వీధి పడ్డారు. బజారు పంచాయితీదాకా వచ్చింది. ఇంతైనాక రత్తమ్మకు తెలియకుండా ఎల్లాఉంటుంది?

* * *

వెంకటరత్నమ్మకు ప్రపంచమంతా గిర్రున తిరిగి పోతున్నట్లనిపించింది. దొడ్డివసారాలో పడుకొని తనమీద పుట్టిన వాదులన్నీ తలచుకొని వెక్కివెక్కి ఏడ్చింది. పుణ్యానికి కెడితే పాపం ఎదురైందే అని దుఃఖపడింది. ఈమధ్య పిల్లలు తనదగ్గరకిరాకపోవడం, తానింటికెడితే జనంముఖంచిట్లించుకోవడం ఇందువల్లనేకదా యని గ్రహించింది. ఎంతకృతఘ్నమైన ప్రపంచమో కదా యని లోకాన్ని నిందించింది. తీగకదిలితే డొంకంతా కదిలినట్లు తనజీవితంలో అసాఖ్యానికి ప్రాతిపదికమైన వైధవ్యాన్ని అసహ్యించుకుంది. సంఘం అకారణంగా తనకు చేస్తున్న అపకారం, చూపుతున్న నిర్లక్ష్యం అన్నీ కండ్లకుకట్టినట్లు కను



"అంటూ ఎవరూ లేరుగదాఅనుకుని రుసరుసలాడింది కరణంగారి ...."

పించాయి. ఈ అన్యాయపుసంఘాన్ని అతిక్రమించమని అంతరాత్మ ప్రబోధించింది. 'ఈ ఊళ్లో నీకు చోటులేదుసుమా' అని మనస్సు హెచ్చరించింది. నీరసంచేత కళ్లు మూతలు పడ్డాయి. అందులో కల. తాను పిల్లల్ని ఆడిస్తూన్నట్లు, పడుచులకు జడలల్లుతూఉన్నట్లు అందరితో కులాసాగా ఆడుకుంటూ ఉన్నట్లు కనుబడింది. వెంటనే మరొకదృశ్యంలో తాను ఇంటికెడితే తలుపులేసుకోవడం, జనం తన పేరు చెప్పి మెటికలువిరవడం కనుపించాయి. రత్తమ్మ ఉలికిపడి కనువిప్పేసరికి తానేదో కొండమీదనుంచి జారిపోతున్నట్లు తోచింది. బాగా స్పృహ తెచ్చుకొని ఈ గ్రామంలో తనకు స్థానంలేదని నిశ్చయించుకుంది. అగ్రహారంలో పచ్చిమంచినీళ్లయినా నోట్లోపోసుకోకూడదని శపథంపట్టింది. ఆనాటితో ఆఊరి ఉదకఋణానుబంధం తీరిపోయింది రత్తమ్మకు.

* * *

మరునాడు ప్రొద్దున్న శాస్త్రిలుగారింట్లో గొల్లుమన్నారు. ఊరంతా గాలించేశారు రత్తమ్మకోసం. చెరువులో వలవేసి వెదికించారు. చుట్టుపక్కలగ్రామాలన్నీ వెదికేరు. ఎక్కడా ఆమె జాడే లేదు. 'అయ్యో శాస్త్రిల్లుగారి కెంతకష్టంవచ్చిందండీ' అని జాలిపడ్డారు కొందరు. 'ఎంతపని చేసిందండీ' అని ముక్కుమీద వేలేసుకున్నారు కొందరు. ఊరిపీడ కొంత వదిలిందని సంతోషించిన వారుకూడా కొందరు లేకపోలేదు. 'ఏశిష్యుడుతోనైనా టోలాయించిందేమో చూడండి' అన్నారు కొందరు ఆకతాయిరకం. ఎవరేమన్నా శాస్త్రిల్లుగారిదుఃఖం, ఆయనభార్య కడుపు

శోకం మాన్పేవా ళ్లెవ్వరూ లేరు. ఏపత్తా లేకపోవడంచేత ఏగోదావర్లోనో పడి ఆత్మహత్య చేసుకుందని నలుగురూ సిద్ధాంతం చేసేశారు. శాస్త్రిలుగారిభార్య పుత్రికా వియోగంచేత మంచంపట్టి మూడు నెలలు తీసుకుని మరణించింది. శాస్త్రిలు తనకున్న భూమికాస్త తెగనమ్ముకుని ఎక్కడికో దేశాంతరం లేచిపోయాడు. కొంత కాలానికి అగ్రహారంలో రత్తమ్మమాటగాని, శాస్త్రిలుగారి కుటుంబంమాటగాని తలపెట్టేవారు లేరు. ఈగాథంతా కాలంలో లీనమైపోయింది.

* * * *

మిస్ రత్నం, యల్. ఆర్. సి. పి. అమలాపురం ఆస్పత్రిలో లేడీ డాక్టరు. ప్రసవ చికిత్సలోను, బిడ్డలవైద్యంలోనూ ఆమెకు చాలిన చెయ్యి ఈ చుట్టుప్రక్కల లేదని పేరుమోసింది. అమలాపురం వచ్చిన రెండుమూడు నెలల్లోనే ఆమెఖ్యాతి వ్యాపించింది. సబ్ జడ్జిగారి కూతురు ప్రసవించలేక ప్రాణాపాయస్థితిలో నున్నప్పుడు మిస్ రత్నం గండంగడిపింది. ఆమెఖ్యాతి కది మొదటి మెట్టు. సారాయి ఇనస్పెక్టరుగారింట్లో దీర్ఘ కాయిలా, తాసిల్దారుగారి కుమార్తెహిస్టీరియా ఆమె వైద్యం చేతే తగ్గడంచేత అశ్వినీ దేవతల అపరావతారమని బిరు దేర్పడిపోయింది. ఆమెహస్తవిశేషాన్ని గురించి ఆశ్చర్యంగా చెప్పుకున్నారు. అమృతహస్తమనే వాడుక పడింది. ఇతర వృత్తుల్లోవలె గాకుండా వైద్యుడికీ వకీలుకీ ఖ్యాతి రొఖంగా ప్రత్యక్షమవుతుంది. మిస్ రత్నం ఎంతలేదన్నా జీతం కాక నెలకు నాలుగువందలు కళ్ల చూచేది. ఆమె జీవితాన్ని గురించి కూడ ఎంతో పవిత్రంగా చెప్పుకునేవారు. మొదటిరోజులలో ఎవరో దక్షిణాది కిరస్తానమ్మ కాబో లనుకున్నారు కాని ఆమెవేషభాషలవల్ల తెలుగుస్త్రీ అని తెల్లమైంది. ఎంతమాత్రం ఆర్భాటం లేని వేషం, ఓర్మి, ఏవేళప్పుడైనా బీదసాదల కందుబాటులో ఉండడం, డబ్బుకోసం నిక్కచ్చిచేయకపోవడం మొదలైన వైద్యునికుండవలసిన మంచిలక్షణాలన్నీ ఆమెయందుండడంచేత డెల్టాడెల్టా అంతాకూడా ఆమెపేరు ప్రతిఇంట్లోనూ మోసిపోయింది. ఆమెకు ప్రాక్టీసు హెచ్చయిపోయి చిన్న మోటారు కూడా కొనవలసివచ్చింది. అతిక్లష్టంగాఖర్చు పెట్టుకుంటుందనీ, ఇంట్లో ఒక్క ఆడనౌకరు తప్ప ఎవ్వరూ లేరనీ, ఏనెల కానెల మిగిలిన డబ్బంతా పునహాలోని మహిళావిద్యాలయానికి పంపేస్తుందనీ వాడుకపడింది.

* * * *

ఒకరోజున తెల్లవారు ఝామున 3 గంటలకెవరో ఇద్దరుపురుషులు మిస్ రత్నంకు నిద్రాభంగం కలిగించి దీనంగా ప్రార్థిస్తున్నారు. అందులో ఒకాయన బాగావయస్సు మళ్లినవాడే.

"అమ్మా, మాఅమ్మాయి కనలేక బాధపడుతోంది. మీరొక్కసారివచ్చి రక్షించాలి. మావూ రిక్కడే ౧౦ మైళ్లలో ఉంది."

" ఏవూరు ? "

"మామిడిపూడి అగ్రహారమమ్మా"

"మామిడిపూడి అగ్రహారమా?"

అని డాక్టర్ గభాలున కళ్లెత్తి చూచింది. ఆమెమనస్సు కేదో చురుక్కుమంది. పూర్వ పరిచయం స్పష్టమైంది.

"మీపేరు?"

"కామావధానులు. వీడు మాఅబ్బాయి. వీడి భార్యే నొప్పులుపడుతోంది."

"ఎప్పటినుంచి?"

"నిన్న ప్రొద్దుటినుంచి."

"ఏనోకాన్పు?"

"రెండోకానుపు. మొదటి కానుపొచ్చి పదిపన్నెండు సంవత్సరాలైంది."

డాక్టరు అల్లా నిలబడిపోయింది. మాటామంతీ లేదు. ఆమెకళ్లల్లోంచి అశ్రుబిందువులు జలజల రాలేయి. కామావధానులకి దేమీ అర్థంకాలేదు.

"అమ్మా, ఫీజుకు సందేహించక్కరలేదు. నిన్ను తప్పకుండా సంతోషపెడతాం. నీదృష్టిపడితేనే ఎల్లాంటి రుగ్మతైనా మాయమైపోతుంది తల్లీ, రక్షించాలి."

అంటూ ఇంకా ఏవోసంస్కృతశ్లోకాలతో సహితంగా ముఖస్తుతి ప్రారంభించాడు. డాక్టర్ ఒక్కక్షణం ఆలోచించి "అయ్యా, మీ ముఖస్తుతి చాలించండి. మీరు ముందెళ్లి మీ ఊరురోడ్డుమొగ నుండండి. తెల్లవారేసరికి వస్తాను." అని చెప్పి పంపించింది.

* * * *

మిస్ రత్నం రామశాస్త్రులుగారివితంతు పుత్రిక వెంకటరత్నమ్మే. అగ్రహారంలోవచ్చిన అప్రతిష్ఠ భరించలేక గ్రామంవిడిచి పూనాలోని మహిళావిద్యాలయంలో పది సంవత్సరాలపాటు చదువుకుంది. బొంబాయిలో వైద్యపరీక్షనిచ్చి మద్రాసు ప్రభుత్వంవారి వైద్యశాఖలో చెన్నపట్నంలో ప్రవేశించింది. తెలుగునాడుకి సేవచేయాలనే తలంపుతో అవకాశం వచ్చినప్పుడు అమలాపురం బదలాయించుకుంది. వస్తూనే మామిడిపూడిఅగ్రహారంలోని తల్లిదండ్రుల సంగతి విచారించింది. వాళ్ల విషాదగాథ తెలుసుకొని చాలా దుఃఖపడింది. ఆమెకు ఆ ఊరు పేరుచెపితే చాలా అసహ్యం కలిగేది. తన జీవితచరిత్రలో ఆభాగాన్ని మరచిపోవడానికే నిశ్చయించుకొని బ్రతికున్నన్నాళ్లు మానవసేవ చెయ్యాలని వ్రతం పట్టింది. అందుకే బహునిరాడంబరంగా జీవితం గడుపుతూ సంపాదించినడబ్బు మహిళాసదనాని కర్పిస్తోంది. తాను మరచిపోయిన మామిడిపూడి అగ్రహారంసంగతి జ్ఞాపకం చేశాడు ప్రొద్దున్నే వచ్చిన కామావధానులు. జ్ఞాపకం చెయ్యడమేమిటి, మనస్సుకు చాలా ఆందోళన తెచ్చిపెట్టేడు. చాలాసేపు ఏమీ తోచక కూచుని వైద్యధర్మం నిర్వర్తించడం తప్పనిసరి అవడంచేత అగ్రహారం మోటారుమీద ప్రయాణమైంది.

* * * *

డాక్టరు రత్నం కామావధానులుగారింట్లో పురిటిగదిలో ప్రవేశించింది. సుబ్బ

లక్ష్మమ్మను పరీక్ష చేసి మందిచ్చింది. అవసర మైన చికిత్సలన్నీ చేసింది. పావుగంటయ్యే సరికి సుబ్బలక్ష్మమ్మ సుఖప్రసవమై కొడుకును కంది. చికిత్స చేస్తున్నంతసేపూ సుబ్బ లక్ష్మమ్మ డాక్టరుముఖం కేసే చూస్తోంది. ఏదో పరిచయం జ్ఞప్తికొచ్చి ఆమె గ్రుడ్లల్లో నీళ్లు తిరిగేయి. డాక్టరుతొడమీద చెయిపెట్టుకుని పడుకుంది. అమ్మలక్కలంతా డాక్టరు సమ ర్థత చూచి సంతోషించారు. "నీ చెయ్యి అమృతహస్తమమ్మా. నీదృష్టి పడితేనేచాలు ఎంతెంతజబ్బులైనా పోతాయి." అని ముఖ స్తుతి చేశారు.

ఈ మాట లనేసరికి డాక్టరుకు చిరా కేసింది. 'నాదృష్టి అంత గొప్పదా ఏమిటి!' అంటూ ఛటాలున కారెక్కి వెళ్లిపోయింది.

*   *   *   *

డాక్టరు వెళ్లిపోయాక సుబ్బలక్ష్మి అత్త గారిని పిలిచి 'వైద్యురాలి ముఖం మన రామ శాస్త్రులుగారి రత్తమ్మ ముఖంలా ఉందండీ' అంది. 'ఆ, మనిషిని పోలిన మనుష్యు లుం టారు. రత్తమ్మెక్కడుంది? ఉన్నా దానికీ తెలి వెక్కడిది? పైగా దానికళ్ల .... 'అని ఏమో చెప్పబోతుంటే కోడలు మాట కడ్డొ చ్చింది

'అల్లాంటి మాట లెందుకండీ అత్త గారూ! మనకర్మం గాని ఒకళ్లు చూస్తే ఏమవుతుందండి. నిజంగా మనమూలానే పాపం ఆరత్తమ్మ అప్రతిష్ఠపాలైంది.'

*   *   *   *

డాక్టర్ రత్నం నాల్గవరోజున పథ్యం పెట్టించడానికి అగ్రహారంవచ్చింది. ప్రొద్దున్నే పరీక్షచేసి ఇకనేమీ భయంలేదనీ, పథ్యం వండచ్చుననీ పురమాయించింది. పురిటిగదిలో బాలింతరాలూ, డాక్టరూతప్ప ఎవ్వరూలేరు. బాలింతరాలు డాక్టర్ చెయ్యి పట్టుకుని వెక్కివెక్కి ఏడ్వడం ఆరంభించింది. వద్దన డానికి వైద్యురాలికీ నోరురాలేదు.

"అమ్మా, నీముఖంచూస్తే నాకేమో అతి పరిచయంగా ఉంది. మాట అంతకన్న పరి చయంగా ఉంది. అట్టే పోల్చుకుంటే మా ఊళ్లో వేదాంతం రామశాస్త్రిలు గారి అమ్మాయి వెంకటరత్తమ్మపోలిక కనబడు తోంది. ఆవిడ నకారణంగా మేమే అప్రతిష్ఠ పాలు చేశాం. మా ప్రాలుబ్ధంకొద్దీ జరిగిన పాపాన్ని ఆవిడ కంటకటి పాపంకట్టుకున్నాం. ఆవిడ ఆత్మహత్య చేసుకుందని ఈ ఊళ్లో వాడుక. రామశాస్త్రిలు గారి కుటుంబం అంతా ఆదెబ్బతో మాసిపోయింది. పుష్క రంకాకుండా వాళ్ల ఇల్లు పాటిదిబ్బయిపోయిం ది. ఆపాపం మేమిప్పు డనుభవిస్తున్నాం." అంటూ ఇక మాటాడలేకపోయింది బాలింత రాలు. డక్టరుకూడా వంచినతల ఎత్తలేదు. తెగిపోయిన హారంలోనుంచి ముత్యాలురాలి నట్లుగా అశ్రువులు జలజలరాలినాయి. ఆఖ రికి 'అవునమ్మా! నేను రామశాస్త్రిలుగా రమ్మాయినే. నాకూ ఈ ఊరొచ్చినప్పటి నుంచీ......' అని ఏమో చెప్పబోతుంటే బాలింతరాలు కెవ్వున కేకవేసి కొయ్యయి

పోయింది. ఇంటిల్లుపాతీ చేరేరుకాని వైద్యురాలు అందరినీ అవతలికి పంపి తలుపేసి స్మారకం రావడాని కన్ని చికిత్సలూ చేసింది. పదినిమిషాలకు స్పృహొచ్చి డాక్టరుచెయ్యి గుండెల నదుముకుని ఏడ్వడం ఆరంభించింది. డాక్టరుకుకూడా దుఃఖం స్వాధీనం కాలేదు. ఏడిస్తే ఆరోగ్యానికి ప్రతిబంధక మని ఓదార్చ పోయింది వైద్యురాలు.

"వెంకటరత్తమ్మా, మా కుటుంబం నీ కెంతో అపరాధంచేశాం. నువ్వు మా అపరాధాన్ని క్షమిస్తావా? ... క్షమిస్తావా?" అంటూ దీనంగా ప్రార్థించింది బాలెంతరాలు.

"క్షమించడానికేముంది? మీరు నిజంగా నాకు మహోపకారం చేశారు. తాత్కాలికంగా అప్పుడు నాకు అసహ్యం కలిగినా, నా యీపరివర్తనానికి కారకులు మీరు. నేనే మీకు కృతజ్ఞురాలను."

"రత్తమ్మా! నీ వల్లా అంటే నామనస్సుకి మరీ కష్టంగా ఉంది. నిజంగా నువ్వు మహా ఔదార్యవంతురాలవు కనుకనే మమ్మల్ని క్షమించి మాయింటికొచ్చి మాకే పుత్రభిక్ష పెట్టేవు. మమ్మల్ని క్షమించానని నీనోటితో అన్నావా, నాకు సంతుష్టి" అని బాలెంతరాలు ప్రార్థించింది.

"నీ కావిచార మక్కర లేదు. నేనాసంగతే మరచి పోయినాను. నువ్వు కూడా మరచిపోయి ఆరోగ్యవంతురాలవు కా."

బాలెంతరాలు ఉద్రేకాన్ని ఆపుకోలేక పోయింది. మెల్లగా లేచి వెంకటరత్తమ్మను కౌగిలించుకుంది.

'అత్తగారూ! శాస్త్రుల్లుగారి రత్తమ్మేనండోయి.' అని కేకేసింది. ఇంటిల్లుపాదీ లోపలికొచ్చి ఆశ్చర్యపోయారు.

*　　*　　*　　*

"మెల్లగా లేచి వెంకటరత్తమ్మను కౌగలించుకుంది......"

అగ్రహారంలోని స్త్రీపురుషు లంతా సమావేశమయ్యారు. 'అపరాధ'మని చెంపలు వాయించుకున్నారు కొందరు. 'క్షమించు' అని ప్రార్థించారు కొందరు.

'మొఖం చూడగానే అనుకున్నాను సుమా' అన్నారు కొందరు తమ వివేకాన్ని తెలుపుతూ. 'అమ్మాయీ, ఎంతదానవయ్యావే' అని అభినందించారు కొందరు ముసలమ్మలు. అగ్రహారంనుంచి లేచివెళ్లినప్పటి నుండీ జరిగిన సంగతులన్నీ తెలుసుకుని సంతోషించారు.

*   *   *   *

కామావధానులు మనుమడి బాలసారి జరిగింది పదకొండోరోజున. డాక్టరు రత్నం కూడా వచ్చింది. కామావధానులు సంతోషంకొద్దీ వైద్యురాలికి నూటపదార్లు వెండి పళ్లెంలో పోసి అందిచ్చాడు.

వెంకటరత్నమ్మ ఆ పళ్లెంలో మరొక బంగారంగొలుసేసి పిల్లవాడికి కట్నం చదివించింది.

*   *   *   *

రామశాస్త్రిలుగారి పాటిదిబ్బమీద కొద్దిరోజులకే చిన్న బంగాళా లేచింది. అందులో బాలికల కొక పాఠశాల, ఉచిత వైద్యాలయం సాగుతున్నాయి. దాని బాధ్యతంతా డాక్టరురత్నంగారిదే. వారాని కొక్క రోజు వచ్చి వెళుతుంది. దిష్టిదేవమ్మ అని ఒకప్పుడు పేరుబడ్డ ఆ గడ్డలోనే 'వెంకటరత్నమ్మ దృష్టిపడితేనే చాలు సంజీవిలాంటి' దని చెప్పుకుంటున్నారు జనం.